క్లుప్తంగా

దావాలపేటలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం–2 పరిధిలోని దావాలపేటలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. సిబ్బందితో కలిసి వైద్యాధికారి 63 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. జ్వరం, తలనొప్పి, దగ్గు, కీళ్ల నొప్పులు, తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో బోర్ల ఏర్పాటు



భూమి పూజ చేసి బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

చీపురుపల్లి: కర్లాం గ్రామంలో రెండు తాగునీటి హ్యాండ్ బోర్ల ఏర్పాటుకు ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 5 నుంచి కర్లాంలో గ్రామదేవత పండగ నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అత్యవసరంగా బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బాణాన రామరత్నం, గ్రామ పెద్దలు బాణాన శ్రీనివాసరావు, రమణల విజ్ఞప్తి మేరకు బోర్లకు మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రామరత్నం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాయితీపై నవధాన్యాల విత్తన కిట్ల పంపిణీ



రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

శృంగవరపుకోట: వినాయకపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి డి.కృష్ణ ఆధ్వర్యంలో రాయితీపై నవధాన్యాల విత్తన కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమి గుల్లబారి పంటకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. వేసవిలో నువ్వుల పంట సాగు చేసే రైతులు నువ్వులతో నవధాన్యాలు విత్తనాలు కలిపి చల్లుకోవాలని సూచించారు. రైతు లంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఐఈఆర్‌పీ ఎస్.రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల నిరసన



చీపురుపల్లిరూరల్(గరివిడి): నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఎంఎల్‌హెచ్‌పీలు(మిడ్–లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు) కోరారు. గరివిడి పీహెచ్‌సీ వద్ద, దత్తిరాజేరు మండలంలోని కె.కొత్తవలస పీహెచ్‌సీ వద్ద ఎంఎల్‌హెచ్‌పీలు గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్యశాఖ మార్గదర్శకాల ప్రకారం తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులతో సమానంగా తమకు 23 శాతం వేతనాలు పెంచాలని, ఇన్సెంటివ్స్, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేజీబీవీ సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ మాలతి

దత్తిరాజేరు: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సమగ్ర శిక్ష జీసీడీఓ మాలతి గురువారం సందర్శించారు. తరగతి గదులు, పాఠశాల పరిసరాలు, వంట శాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన ఎనిమిది మంది విద్యార్థినులతో మాట్లాడారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని నిరాశ చెందొద్దని, మళ్లీ పట్టుదలతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని వారికి ప్రేరణ కల్పించారు.ఫెయిల్ అయిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎస్‌ఓ శివజ్యోతికి సూచించారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు

- సమావేశాలకు హాజరు కారు.. సమస్యలు తెలుసుకోరు
- 11 నెలలుగా పరిపాలన గాడి తప్పింది
- ఉపాధిహామీ పథకాన్ని దౌర్భాగ్య స్థితిలోకి నెట్టారు
- 12 వారాలుగా వేతనదారులకు వేతనాలు అందని దుస్థితి
- మేట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదు
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

చీపురుపల్లి: ''పాలకులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఎక్కడున్నారో తెలియడం లేదు. 11 నెలలుగా ప్రజా పరిపాలన గాడి తప్పింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావడం లేదు. సమావేశాలకు రావడం లేదు సరికదా క్షేత్ర స్థాయిలో ప్రజలు పడుతున్న కష్టాలనూ తెలుసుకోవడం లేదు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితులు గతంలో ఎన్నడూ లేవు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు....పూర్వం మాదిరిగా జిల్లాలో ప్రజలు మళ్లీ వలసలు వెళ్లే దుస్థితిని కూటమి పాలకులు తీసుకొచ్చారు. 12 వారాలుగా ఉపాధి వేతన దారులకు డబ్బులు అందడం లేదు. కనీస వేతనం కూడా అందక నిత్యావసరాలు కొనుగోలు చేసుకోలేక పోతున్నారు. గత ప్రభుత్వంలో పేదలకు నిరంతరం సేవలు అందిస్తూ ఆర్థికంగా వారిని బలోపేతం చేశాం. కూటమి ప్రభుత్వం పేదల ఆకలితో ఆటలాడుతోంది.'' అంటూ మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు రెండు దశాబ్దాల క్రితం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఇంతవరకు ఆ పథకం పేదలకు ఎంతో ఆసరాగా నిలిచిందన్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేక పేదల కడుపుకొడుతోందని ఆరోపించారు. 12 వారాలుగా వేతనదారులకు వేతనాలు అందకపోయినప్పటికీ పట్టించుకునే నాథుడే లేడన్నారు. పేదల సమస్యలు పట్టించుకోని కూటమి నేతలు గ్రామాల్లో మేట్లను తొలగించడంలో మాత్రం శ్రద్ధ చూపిస్తున్నారని, మేట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి కనీస వేతనం రూ.300 వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వేతనదారులకు సకాలంలో వేతనాలు అందకపోతే వారు నిత్యావసర సరుకులు ఎలా కొనుగోలు చేసుకోగలుగుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఉపాధి పని దినాలు అదనంగా కావాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే పరిస్థితులు ఉండేవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మళ్లీ వలస బాట పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్పీ ఛైర్మన్ ఆదేశించారు.అలాగే మూగజీవాలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రక్షిత మంచినీటి పథకంలో పని చేస్తున్న పంప్ మెకానిక్స్‌ను పంచాయతీలకు అనుసంధానం చేసి నిరంతర పర్యవేక్షణకు ఉపయోగించాలన్నారు. చీపురుపల్లి ఏరియా ఆస్పత్రిలో 10.30 గంటల వరకు ఎక్స్‌రేలు తీయమని సిబ్బంది చెబుతున్నారని, అదేంటని ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం ఇస్తున్నారని నిమ్మలవలస ఎంపీటీసీ అధికార్ల శ్రీనుబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన జెడ్పీ ఛైర్మన్ గ్రామాల్లో ప్రజలకు కష్టాలు వస్తే ప్రజాప్రతినిధులు వద్దకు వెళతారని అలాంటి వారిని గౌరవించకపోతే ఎలా అంటూ సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీలు కరిమజ్జి వెంకటరమణమ్మ, పతివాడ పద్మావతి, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, డీఎల్‌డీఓ హేమసుందరరావు, ఎంపీడీఓ ఐ.సురేష్, తహసీల్దార్ ఎస్.రాజారావు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యలను త్వరగా పరిష్కరించాలి



భూహక్కు పత్రాలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు

కొత్తవలస: తమ భూసమస్యలను త్వరగా పరిష్కరించాలని చిన్నిపాలెం గ్రామ రైతులు రెవెన్యూ అధికారులను కోరారు. భూహక్కు పత్రాలు రైతుల వద్ద ఉండడంతో పాటు ఆ భూములను వారే సాగుచేసుకుంటున్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారుల పేర్లను చూపిస్తుండడంతో సమస్యను గ్రామస్తులు ఇది వరకు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన అధికారులు రైతులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు ఇటీవల నోటీసులు జారీ చేసి గురువారం తహసీల్దార్ కార్యాలయానికి హాజరు కావాలని పేర్కొన్నారు. దీంతో రైతులు తమ వద్ద ఉన్న భూహక్కు పత్రాలు, క్రయ, పురోణీ పత్రాలు,గతంలో ప్రభుత్వానికి చెల్లించిన భూమిశిస్తు రసీదులు తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి గురువారం వచ్చారు. అయితే తహసీల్దార్ అత్యవసర పనిపై జిల్లా కేంద్రానికి వెళ్లిపోవడం, సదరు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ వారు సైతం హాజరు కాకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్రామపెద్దలు సింగంపల్లి గణేష్, ఎస్.కె.సయ్యద్, మెయ్యి దేముడుబాబు మాట్లాడుతూ తాత తండ్రుల నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని, కానీ రెవెన్యూ రికార్డుల్లో తమ భూములు రియల్ ఎస్టేట్ సంస్థల పేరిట చూపిస్తున్నాయని అన్నారు. దీంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని వాపోయారు.అలాగే మండలం మీదుగా వెళుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు ఇచ్చిన రైతులకు ఇంకా పరిహారం అందలేదని చెప్పారు. తక్షణం రికార్డులను సరిచేసి న్యాయం చేయాలని కోరారు. డీటీ పప్పు హరి మాట్లాడుతూ తహసీల్దార్ దృష్టికి విషయాన్ని మరోమారు తీసుకువెళతానని, ఇరు వర్గాలనూ కార్యాలయానికి రావల్సిందిగా నోటీసులు జారీ చేస్తామని డీటీ తెలిపారు.

రైల్వే గేటును ఢీకొట్టిన ఆటో



రైల్వే గేటును బాగు చేస్తున్న రైల్వే సిబ్బంది

గజపతినగరం: మండల కేంద్రంలో పురిటిపెంట వద్ద రైల్వే గేటును గురువారం సాయంత్రం ఓ ఆటో ఢీకొట్టడడంతో రైల్వేగేటు విరిగిపోయింది. గజపతినగరం నుంచి మెంటాడ వైపు ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి రైల్వే గేటును ఢీకొట్టింది .ఈఘటనలో గేటు విరిగిపోవడంతో సిగ్నల్ వ్యవస్థ కూడా దెబ్బతింది. సుమారు అరగంట సేపు గేటుకు రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైల్వే సిబ్బంది గేటును బాగు చేసిన తర్వాత వాహన రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజపతినగరం రూరల్: గడ్డి మందు తాగిన మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన బోర సూర్యనారాయణ(56) జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు... నెల రోజులుగా నిద్రలేమి సమస్యతో సూర్యనారాయణ బాధపడుతున్నాడు.మందులు వాడుతున్నా ఫలితం లేకపోయేసరికి ఆందోళనకు గురై బుధవారం రాత్రి గడ్డి మందు తాగేశారు. కుటుంబ సభ్యులు ఆయన్ని గజపతినగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పినప్పటికీ పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు.మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

వ్యవసాయ యంత్రాల పరిశీలన

గజపతినగరం రూరల్: మండలంలోని కొణిశ, కొత్తబగ్గాం గ్రామాల్లో రైతులకు యాంత్రీకరణ పథకం ద్వారా మంజూరు చేసిన దుక్కు యంత్రాలను ఆగ్రోస్ జిల్లా ప్రబంధకులు చంద్రశేఖర్ బాబు గురువారం పరిశీలించారు. యంత్రాలను వినియోగిస్తున్నదీ లేనిది రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీఏ మహారాజన్, ఏఓ ధనలక్ష్మి, వీఏఏలు సౌజన్య, భార్గవి ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మెరకముడిదాం: చెల్లాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు



గంట్యాడ: బోనంగిలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

మెరకముడిదాం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తాడ్డి శ్రీదేవి అన్నారు.పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని చెల్లాపురం గ్రామంలో అంగన్‌వాడీ, స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆశవర్కర్లు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు,కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను, చిన్నారుల వెయ్యిరోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ రెడ్డి వరం, ఉపాధ్యాయులు ముత్యాల నాయుడు, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఏఎన్‌ఎం వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా చూసుకోవాలి

గంట్యాడ: గర్భిణులు రక్తహీనత రాకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి సూచించారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా బోనంగి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పిల్లల్లో ఊబకాయం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ,హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



గజపతినగరం : బడిబాట ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ విమలమ్మ



శృంగవరపుకోట: చుక్కవానిపాలెంలోవేతనదారులతో మాట్లాడుతున్న సంతగవిరమ్మపేట హెచ్‌ఎం బంగారునాయుడు



మెరకముడిదాం: చినబంటుపల్లిలో ఉపాధి పనుల వద్ద ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



చీపురుపల్లి: సంకుపాలెంలో ఇంటింట ప్రచారం చేస్తున్న మెట్టపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు



వేపాడ: వేపాడలో ప్రచారం చేస్తున్న ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు, తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్య అందుతుందని గజపతినగరం, వేపాడ ఎంఈఓలు విమలమ్మ, నాగభూషణం, బాల భాస్కర రావు, పలువురు హెచ్‌ఎంలు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సంబంధించి 'బడిబాట' పేరిట ఉపాధ్యాయులు గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. గజపతినగరం బాలికోన్నత పాఠశాల ఆవరణలో బడిబాట కార్యక్రమానికి సంబంధించిన ప్రచార రథాన్ని ఎంఈఓ విమలమ్మ ప్రారంభించారు. వేపాడలో ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కర రావు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఇంటింట ప్రచారం చేసి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి, సంకుపాలెం, కరకాం, పత్తికాయవలస తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్న ఫలితాలు, సదుపాయాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మెరకముడిదాం మండలంలోని చినబంటుపల్లిలో ఆ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఆల్తిరాంబాబు, ఉపాధ్యాయులు, ఎస్.కోట మండలంలోని చుక్కవానిపాలెం, వినాయకపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో సంతగవిరమ్మపేట పాఠశాల హెచ్‌ఎం బంగారునాయుడు, ఉపాధ్యాయులు వేతనదారులకు అవగాహన కల్పించారు.

– గజపతినగరం/వేపాడ/చీపురుపల్లి/మెరకముడిదాం/శృంగవరపుకోట

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏపీ సీఎస్ ఎఫ్ రీసెర్చ్ కో–ఆర్డినేటర్ హేమసుందర్ తెలిపారు. బొండపల్లి మండలంలోని కనిమెరక గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై ఏపీ సీఎస్‌ఎఫ్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా గురువారం అవగాహన కల్పించింది. పెట్టుబడి లేని ప్రకృ తి వ్యవసాయమే అన్ని విధాలా మేలని రైతులకు అధికారులు వివరించారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తన కిట్లను పంపిణీ చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓలు గోవిందమ్మ, సోమేశ్వరరావు, మండల ఏఓ పి.వి.మల్లికార్జునరావు, వీహెచ్‌ఏ నారాయణరావు పాల్గొన్నారు.

– బొండపల్లి

జాతీయస్థాయి చిత్రలేఖనపోటీల్లో ప్రతిభ



జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. యంగ్ చిల్డ్రన్స్ ఆఫ్ అకాడమీ, ఫైన్ ఆర్ట్స్ ట్రస్టు అకాడమీ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా విజయవాడలో ఏప్రిల్ 5న 12వ జాతీయస్థాయి ఆర్ట్ కాంపిటేషన్ అండ్ ఎగ్జిబిషన్ నిర్వహించాయి. ఈపోటీల్లో పెదనడిపల్లి పాఠశాల విద్యార్థులు జి.మీనాక్షి, బి.రేష్మ, జి.రాములు స్వర్ణ పతకాలు, ఎస్.గ్రేసీ ప్రియాంక, ఎం.రోహిత్, ఆర్.గౌతమ్, ఎం.లలిత్‌సాగర్, ఆర్.లీలాపవన్, ఎం.దివ్య చరిత రజత పతకాలు సాధించారు. విద్యార్థులతో పాటు డ్రాయింగ్ టీచర్ పిసిని మహేష్‌ను ఆ పాఠశాల హెచ్‌ఎం మద్దెల శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

– చీపురుపల్లి

సామూహిక సీమంతాలు



పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా కొత్తవలస మండలంలోని ముసిరాం గ్రామ వెల్‌నెస్ కేంద్రంలో గర్భిణులకు ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ సమక్షంలో గురువారం సీమంతాలు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.వియ్యంపేట ఐసీడీఎస్ పీఓ రొంగళి ఉమాదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పిల్లల్లో ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు వివరించారు. సర్పంచ్ చింతల పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

–కొత్తవలస

సీసీ రోడ్డు పరిశీలన



గ్రామస్తులు, రైతులతో మాట్లాడుతున్న అధికారులు

వేపాడ: మండలంలో వావిలపాడులో కృష్ణరాజు చెరువు గట్టుపై నిర్మించిన సిమెంట్ రోడ్డును ఇరిగేషన్ జేఈ హనుమంతురావు, పీఆర్‌ఏఈ మహమ్మద్ ఆలీ, ఆర్‌ఐ రామలక్ష్మి, వీఆర్‌ఓలు గురువారం పరిశీలించారు. చెరువుగట్టుపై రోడ్డు నిర్మించారన్న సమాచారం మేరకు అధికారులు రోడ్డును పరిశీలించి, స్థానిక రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. సర్పంచ్ బీల రాజేశ్వరితో పాటు పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ చెరువుగట్టుపై సీసీ రోడ్డు ప్రజల ప్రయోజనం కోసమే నిర్మించామే తప్ప ఎవరి స్వార్థానికి కాదని వివరిస్తూ, అధికారులకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ తీర్మానం చేసి పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు వేశామని సర్పంచ్ అధికారులకు వివరించారు. గతంలో గ్రామసభ తీర్మానంతో చెరువు గట్టుపై ఉపాధి హామీ పథంకంలో మట్టిరోడ్డు నిర్మాణం చేసుకున్నామని, 2016–17లో ఎంపీ నిధులతో మెటల్ రోడ్డు వేశామని చెప్పారు.రైతులు పొలాల నుంచి పంటను కల్లాలకు తెచ్చుకునేందుకు సౌలభ్యంగా ఉంటుందని రోడ్డు వేశామని సర్పంచ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పీఓ ఉమకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు

శృంగవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పీఓ ఉమకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్ డి.శ్యామల మాట్లాడుతూ మినీసెంటర్ల వర్కర్లకు మెయిన్ సెంటర్ల వర్కర్ల మాదిరిగా వేతనాలు, వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. అలాగే రాష్ట్రస్థాయిలో విజయవాడలో ఈనెల 21న జరిగే ధర్నాకు వెళ్లనున్న అంగన్‌వాడీ వర్కర్లకు సామూహిక సెలవు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ఎస్.దేవి, జి.రమణమ్మ, అరుణజ్యోతి, సత్యవతి, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూడండి

చీపురుపల్లి: కర్లాం పంచాయతీలో మే 5 నుంచి గ్రామదేవత పండగ నిర్వహించనున్న నేపథ్యంలో పండగ సమయంలో తాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ విషయాలను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పండగ నిర్వహించనుండడంతో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని జెడ్పీ ఛైర్మన్‌కు సర్పంచ్ వివరించారు. ప్రధానంగా విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, పండగ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నామని చెప్పారు. స్పందించిన జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ విద్యుత్, త్రాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో అన్నిశాఖలతో సమావేశం ఏర్పాటు చేసి సమన్వయం చేయాలని ఎంపీడీఓ సురేష్‌కు సూచించారు.